శివ తాండవ (రావణ కృత) స్తోత్రమ్

- భావార్థముతో.-



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

శివ తాండవ (రావణ కృత) స్తోత్రమ్ - భావార్థముతో.

01. జటాటవీగలజ్జల ప్రవాహపావితస్థలే
గలేఽవలంబ్య లంబితాం భుజంగతుంగ మాలికామ్।
డమడ్డమడ్డమడ్డమ న్నినాదవడ్డమర్వయం
చకార చండ తాండవం, తనోతు న శ్శివశ్శివమ్॥

అడివివలె పెరిగిన జడల నడుమనుండి జారుచున్న గంగచే పావన మగుచున్న ప్రదేశములో - మెడలోని సర్పహారము వ్రేలాడుచుండగా - చేతిలోని డమరుకము ఢమ ఢమ ఢమ యని నినదించుచుండగా శివుడు ప్రచండ తాండవమును సాగించెను. ఆ తాండవ నర్తకుడు - శివుడు - మాకు సకల శుభములను ప్రసాదించుగాక.

తన జటాజూటము నుండి ప్రవహించే పవిత్రమైన గంగమ్మ మెడపైనుండి జాలువారుతుండగా, ఒక మహా సర్పము కంఠమునకు ఆభరణము కాగా, హస్తములోని డమరుకము ఢమ ఢమ ఢమ మని నాదము చేస్తుండగా, పవిత్ర తాండవము చేసే శివుడు మనందరికి ఐశ్వర్య సమృద్ధిని కలిగించుగాక.

అరణ్యమును పోలు జడనుంచి స్రవించు గంగానదీ ప్రవాహము చేత పావనము (శుద్ధి చేయబడినది) అయినటువంటి ప్రదేశంలో (కైలాసం)... కంఠము నందు సర్పము వ్రేలాడుతూ మాలవలె అలంకారముగా భాసిస్తున్న, - శివుడు వస్తూనే నాట్యము ఆరంభానికి సూచనగా తన డమరుకముతో 'డమ' 'డమ' అను శబ్దములు మ్రోగిస్తూ - తనదైన శక్తినంతా ప్రకటిస్తూ తాండవం చేస్తున్న ... ఆ పరమశివుడు నాకు సమస్త శుభములను కలిగించునుగాక ...

జటాఝూటం నుండి ప్రవహిస్తున్న గంగాజలంతో అభిషేకించబడుతున్న మెడతో - మెడలోని సర్పహారము మాలలా వ్రేలాడుచుండగా - చేతిలోని ఢమరుకము ఢమ ఢమ ఢమ ఢమ యని మ్రోగుచుండగా శివుడు ప్రచండ తాండవమును సాగించెను. ఆ తాండవ నర్తకుడు శివుడు మాకు సకల శుభములను ప్రసాదించుగాక.

02. జటాకటాహ సంభ్రమ భ్రమన్నిలింప నిర్ఝరీ
విలోలవీచి వల్లరీ విరాజమాన మూర్ధని॥
ధగద్ధగద్ధగజ్జ్వల ల్లలాట పట్టపావకే
కిశోరచంద్రశేఖరే రతిః ప్రతిక్షణం మమ॥

శివుని జడలే కటాహము. ఆ కటాహమున సురగంగ వేగముగా సుడులు తిరుగుచున్నది. అపుడందు ఉదయించుచున్న తరంగలతికలతో ఆయన శిరము విరాజిల్లు చున్నది. అట్టి మహాదేవునియందు - ఫాల భాగమున ధగ ధగ మెఱయుచున్న అగ్నిని, శిరమున బాలచంద్రుని ధరించియున్న మహాదేవునియందు నా ప్రీతి నిరంతరము ప్రకాశించుగాక!

శివుని జటాజూటము అనే లోతైన కటాహములో, అత్యంత వేగముగా సుడులు తిరుగుతున్న గంగమ్మ యొక్క తరంగములతో ఈశ్వరుని శిరస్సు ప్రకాశమానమై ఉన్నది. తన ఫాలభాగములో భగ భగ మంటూ అగ్నివలే మెరయుచున్న మూడవ నేత్రము, శిరసుపై చంద్ర రేఖను ధరించిన ఈశ్వరునియందు నా ప్రీతి ఎల్లప్పుడు నిలచియుండుగాక.

శివుడు జడలు బంధించిన తరువాత మధ్యలో ఏర్పడిన చోటు ఓ పెద్ద పాత్రలా వున్నది. - ఆ పాత్రలో గంగానది తడబడుతు సుడులు తిరుగుతున్నది. కదులుతున్నటువంటి తరంగాలు (అలలు) తీగలా వెల్తున్నాయి. ఆ అలలతో

శోభిల్లుతున్నటువంటి జడలతో ఉన్నటువంటి శిరస్సు కలిగినవాడు; మాటి మాటికీ మిరుమెట్లు గొలుపుతూ నుదుటి మీద ఎరుపు కాంతులు (అగ్నిజ్వాల) పరుచుకోవడంతో అలంకారముగా ఏదైనా గుడ్డ కట్టుకున్నాడా అన్నట్లుగా ఉన్న స్వామి; బాల చంద్రప్రభతో శోభిల్లునట్టివాడు అయిన పరమశివుని యందు ... నా మనస్సు ప్రతిక్షణమూ మక్కువతో లీనమవుగాక!

శివుని జడలు నీటిని ఒడిసిపట్టే లోతైన బావిలా ఉండగా, అందులో సురగంగ వేగంగా సుడులు తిరుగు చున్నది. అప్పుడు దానిలో బారులుతీరి ప్రకాశించే తరంగాలతో ఆయన శిరము మిరిమిట్లు గొలుపుతున్నది. అలాంటి మహాదేవునియందు – నుదుటి భాగమున ధగ ధగ మెరుస్తున్న అగ్నిని, శిరస్సుపై బాలచంద్రుని ధరించియున్న శివుని పట్ల నాకు గొప్ప శ్రద్ధ కలదు.

03. ధరాధరేంద్ర నందినీ విలాసబంధు బంధుర
స్ఫురద్దిగంత సంతతి ప్రమోద మానమానసే।
కృపాకటాక్ష ధోరణీ నిరుద్ధ దుర్ధరాపది
క్వచిద్దిగంబరే మనో వినోద మేతు వస్తుని॥

గిరిరాజకుమారి యొక్క అందమునకు సహకారియైన శిరోభూషణము తన కాంతులచే సర్వదిగంతములను మెఱయించు చుండగా ఆనందముతో ఉప్పొంగుచున్న స్వామియందు తన కరుణాకటాక్షములచే ఎంతటి విపత్తు నైన వెనుకకు నెట్టివేయు ప్రభునియందు – అనిర్వచనీయ దిగంబర తేజమందు – నా మానసము వినోదించుగాక!

పర్వతరాజ పుత్రియైన పార్వతి సిగలో ఉన్న ఆభరణము తన కాంతితో అన్ని దిక్కులలోనూ మెరయుచుండగా, సంతోషముతో పొంగిపోవుచున్న శివుని తలచి ఎంతటి ఆపదయైనా తొలగిపోవుచుండగా, వర్ణించనలవిగాని స్వామి దిగంబర రూపమునందు నా మనసు రమించుగాక.

పర్వత రాజు కుమార్తె పార్వతీదేవి యొక్క విలాసములు (అలంకారాలు లేదా లీలలు) దిక్కులను వ్యాపించిపోయాయి. అమ్మ వారి యొక్క లీలా విలాసాలు అన్ని దిక్కులలో వ్యాపించిపోతూవుంటే అక్కడే ఉన్న శివుడు అమితమైన ఆనందంతో కూడిన మనసుతో నాట్యం చేస్తున్నాడు. ఎవని కృపాకటాక్ష వీక్షణాలు సోకితే సమస్త ఆపదలు నశించునో – అట్టి అనిర్వచమైన దిగంబర తేజమునందు – నా మనస్సు వినోదము పొందుగాక!

ఎవరి మదిలోనైతే తేజోవంతమైన విశ్వంలోని జీవులు వర్ధిల్లుతాయో, ఎవరు పర్వతరాజు కుమార్తె అయిన పార్వతీదేవికి తోడై ఉంటాడో, ఎవరు తన కరుణా కటాక్షములచే ఎంతటి ప్రమాదాన్ని అయినా అడ్డుకోగలడో, ఎవరు అంతటా విరాజిల్లుతున్నాడో, ఎవరు ముల్లోకములను వస్త్రాలుగా కప్పుకుని ఉన్నాడో అట్టి పరమ శివుని యందు నా మనస్సు రచించుగాక.

04. జటాభుజంగ పింగళ స్ఫురత్ఫణామణిప్రభా
కదంబ కుంకుమ ద్రవప్రలిప్త దిగ్వధూముఖే।
మదాంధ సింధురస్ఫుర త్త్వగుత్తరీయ మేదు రే
మనో వినోద మద్భుతం, బిభర్తు భూతభర్తరి॥

జడలలో సర్పరాజులతో, భుజమున గజ చర్మముతో స్వామి తాండవము సాగించు చున్నాడు.ఆ పాముల పడగలమీద పచ్చగా మెఱయుచున్న మణులే దిక్కాంతా కపోలములపై ఎఱ్ఱని కుంకుమ కాంతులను విరజిమ్ముచున్నవి. మదగజ చర్మము సొగసైన ఉత్తరీయముగా స్వామి భుజముపై కదలాడుచున్నది. ఇట్లున్న నటరాజైన ఆ భూతనాథుని యందు నా మానసము మహానంద తుందిలమై వర్ధిల్లుగాక!

గోధువ వర్ణపు రంగు కలిగి, శిరసున మణితో ఎర్రటి ప్రకాశమును అన్ని దిక్కులలోనూ వ్యాపింప చేస్తున్న నాగులను తన జటలో ధరించి, గజ చర్మమును

ఉత్తరీయముగా భుజమున ధరించి, ఆ ఉత్తరీయము అటూ ఇటూ కదలాడుతుండగా, సమస్త దిక్పాలకుల ముఖములు కాంతితో వెలిగిపోతుండగా నాట్యము చేయుచున్న శంకరుని యందు నా మానసము నర్తించుగాక.

శివుడు యొక్క జడలను అలంకరించిన సర్పము పడగల మీద ఉన్న పచ్చని మణి (రత్నం) కాంతులతో ప్రకాశిస్తూ ఉండగా ... దిక్కులను ఎర్రని కుంకుమ కాంతులతో విరజిమ్ముతున్నాయి. ... మదగజ చర్మముతో చేయబడిన ఉత్తరీయము (జధ్యం) స్వామి భుజములపై కదలాడు చున్నది. సమస్త భూతాధిపతిగా శోభించుచున్న వాడు - నా మనస్సును ఆనందముతో నింపునుగాక...

సర్వ దిక్కులను పాలించే దేవతల చెక్కిళ్ళపై ఎర్రని కాంతులను విరజిమ్మే విధంగా ప్రకాశించే మణిని పడగలపై ఉంచుకున్న సర్పమును చుట్టుకుని, మదపుటేనుగు చర్మంతో చేయబడిన అందమైన ఉత్తరీయమును భుజముపై ధరించి, సర్వ ప్రాణులకు సమ న్యాయం చేసే, భూతనాథుడైన పరమ శివునియందు నా మనస్సు మహానందభరితమై వర్ధిల్లుగాక!

05. సహస్రలోచన ప్రభృ(భ్యృ)త్యశేషలేఖశేఖర
ప్రసూన ధూళిధోరణీ విధూసరాంఘ్రి పీఠభూః।
భుజంగ రాజ మాలయా నిబద్ధజాట జూటక(ః)
శ్రియై చిరాయ జాయతాం చకోరబంధు శేఖరః॥

చకోరములకు విందులు సేయు జాబిలిరేకను తలదాల్చిన స్వామి, ఇంద్రాది దేవతల సిగదండల పుప్పొడిచే ధూళి దూసరమైన పాద పీఠముగల ప్రభువు, పాప పేరులతో జడలను బిగియ గట్టిన జగదీశుడు - మాకు తరుగని సిరులను కరుణించుగాక!

చంద్రుని కిరీటముగా ధరించి, ఇంద్ర, విష్ణు మొదలైన దేవతల శిరస్సుల నుండి రాలుతున్న పుప్పొడి తన పాద పీఠమును కప్పివేస్తుండగా, ఒక సర్పముతో తన జటను గట్టి ముడిగా చుట్టిన సదాశివుడు మాకు అంతులేని ఐశ్వర్యమును ప్రసాదించుగాక.

వెయ్యి కన్నులు కలిగిన ఇంద్రుడు మొదలైన దేవతలందరు శివుని పాద పీఠం దగ్గర తల వాల్చగా - వాళ్ళ తలకు ఉన్నటువంటి పువ్వుల పుప్పొడిచే ... ప్రభవించిన ధూళి కారణంగా, మెత్తగా అయినటువంటి (అలాంటి) పీఠం పై పాదం పెట్టి నాట్యం చేస్తున్నాడు. - సర్పము చేత బంధింపబడిన (నాట్యం చేసేటప్పుడు జడ అటు ఇటు కదలకుండా) జడ కలిగిన స్వామి - చకోర పక్షులకు (ఎందుకంటే అవి చంద్రకాంతిని ఇష్టపడతాయి) స్నేహితుడైన చంద్రుని శిరస్సు యందు ధరించినవాడు నాకు చిరకాలము ఐశ్వర్యమును ప్రసాదించుగాక!

చంద్రుని తలపై కిరీటంగా కలవాడు, ఎర్రని సర్పమాలతో కేశాలను బిగించి ముడివేసిన వాడు, ఇంద్రాది దేవతల సిగదండలలోని పువ్వుల పుప్పొడితో ధూళి దూసరమై ఉన్న నల్లని పాద పీఠముగల వాడు అయిన పరమేశ్వరుడు మాకు తరుగని సిరులను కరుణించుగాక!

06. లలాట చత్వర జ్వలద్ధనంజయ స్ఫులింగభా-
-నిపీతపంచసాయకం, నమన్నిలింప నాయకమ్।
సుధామయూఖ లేఖయా, విరాజమాన శేఖరం
మహాకపాలి సంపదే, శిరోజటాల మస్తు నః॥

లలాట వేదికయందు ప్రజ్వలించు అగ్ని విస్ఫులింగముల సెగచే అగ్నిని హరించినది - ఇంద్రునిచే మ్రొక్కబడునది, శశిరేఖచే సుశోభితమైన కిరీటము గలది - జటామండిత మస్తకమైనది - పెద్ద కపాలమును చేత బూనినది అయిన దివ్య తేజమొకటి మాకు సంపత్ప్రదమై ఉదయించుగాక!

లలాటము అనే యజ్ఞ వేదికయందు భగభగమని మండుచున్న జ్వాలలనే అగ్ని, అగ్నినే హరించివేయగా, ఇంద్రదేవునిచే స్తుతించబడుతూ, చంద్రరేఖచే శోభాయ మానమైన కిరీటము కలిగి, చేత కపాలమును ధరించిన ఒక అద్భుత తేజోస్వరూపము, మాకు ఐశ్వర్యకరమై ఉదయించుగాక.

నుదిటి మీద హోమాగ్ని వలె ప్రజ్వరిల్లుచున్న అగ్ని, ఆ అగ్నిలో పంచ బాణుడైన మన్మథుని ధగ్ధము చేసినవాడు, లోకనాయకుడు – తలపై ఉన్న నెలవంక కారణంగా అమృత కిరణముల చేత విరాజిల్లుచున్న శిరస్సు కలిగినవాడు – గొప్ప కపాలమును, బూడిదనే సంపదలుగా తలమీద, జడలలో ధరించిన ఆ పరమేశ్వరునికి నమస్కారం!

ఏది – ఇంద్రాది దేవతలచే మ్రొక్కబడుతుందో, ఏది – చంద్రరేఖతో శోభాయమానంగా వెలుగుతోందో, అటువంటి నుదుటిని కలిగి, దానియందు ప్రజ్వరిల్లే అగ్గిరవ్వల సెగలతో ఎవరు, మన్మథుని హరించాడో, అటువంటి పరమశివుని యొక్క చిక్కులుపడ్డ జటల నుండి సర్వ సంపత్కరమైన సిద్ధులు మాకు అనుగ్రహింపబడు గాక!

07. కరాళ ఫాల(భాళ)పట్టికా ధగద్ధగద్ధగజ్జ్వల
ద్ధనంజయా ధరీ(హుతీ)కృత ప్రచండపంచసాయకే।
ధరాధరేంద్ర నందినీ కుచాగ్రచిత్ర పత్రక-
-ప్రకల్పనైకశిల్పిని త్రిలోచనే మతిర్మమ॥

విశాల ఫాలభాగమున ధగ ధగ మెఱయు మహాగ్నియందు ప్రచండుడైన మన్మథుని ఆహుతి యొనర్చి కొండలరాయుని కూతురు యొక్క కుచాగ్రములపై, మకరికాపత్రరచనా శిల్ప నైపుణ్యమును ప్రదర్శించు మూడు కన్నుల వేలుపుస్వామిపై నా మానసము లగ్నమై వర్ధిల్లుగాక!

ఫాల భాగమునందు భగభగమని జ్వలించుచున్న మహాగ్ని, కామదేవుడైన మన్మథుని ఆహుతి చేయగా, పర్వతరాజ పుత్రియైన పార్వతీదేవి కుచాగ్రములపై, ఎంతో నైపుణ్యముతో తన శిల్పరచనను ప్రదర్శించు త్రినేత్రుడైన స్వామి యందు మా మనసు ఎల్లప్పుడు నిలచి ఉండుగాక.

భీకరమైన నుదుట ప్రదేశమున ధగద్ధగాయమాన జ్వాలలతో వెలుగొందు అగ్నిచేత ప్రచండుడై మన్మథుని దహించినవాడు - పర్వత రాజు కుమార్తె అయిన పార్వతీదేవి యొక్క వక్షములపై శివుడు (మన్మథుని దహించిన తరువాత) తన చేతి వ్రేళ్ళతో చిత్రములు రచించువాడు (ఆమె యందు అనురక్తి కలవాడు) - మహా శిల్పి (లోక సృష్టియందు) అయిన మూడు కళ్ళ వాని యందు నా మనస్సు మక్కువ పొందుతున్నది!

విశాల నుదుటి భాగమున ధగ ధగ మనే మహా అగ్ని జ్వాలలతో ప్రచండుడై, మన్మథుని ఆహుతియొనర్చి, పర్వతరాజు కుమార్తె అయిన పార్వతీదేవి యొక్క కుచాగ్రములపై మకరికాపత్రరచనా శిల్ప నైపుణ్యమును ప్రదర్శించు మూడుకన్నుల వేలుపు స్వామిపై నా మనస్సు లగ్నమై వర్ధిల్లుగాక!

08. నవీనమేఘ మండలీ నిరుద్ధ దుర్ధరస్ఫురత్-
కుహూ నిశీథినీ తమః ప్రబంధ బంధు(బద్ధ) కంధరః।
నిలింపనిర్ఝరీ ధరస్తనోతు కృత్తిసింధురః
కళానిధాన బంధురః శ్రియం జగద్ధురంధరః॥

క్రొక్కారు మబ్బులు చెలరేగి చుట్టుముట్టిన అమావాస్య నాటి అర్ధరాత్రి యందలి చిమ్మచీకటులను ముద్దగా జేసి యిచట బంధించినారా అనునట్లుగా కంఠదేశముగల వేలుపుదేవర, ఏనుగుతోలును బట్టగా చుట్టుకున్న చంద్రమౌళి, జగద్భారము నెల్ల వహించు స్వామి మాకు సిరులను విరివిగా కరుణించుగాక!

అమావాస్య నాటి రాత్రి నల్లగా దట్టముగా ఒక చోట పేరుకున్న మబ్బులన్నిటినీ ఒక ఉండగా చుట్టి ఇక్కడ ఉంచారా అనిపించే గరళ కంఠము కల స్వామి, గజ చర్మమును వస్త్రముగా ధరించిన ఈశ్వరుడు, సకల జగముల భారమును మోసే శివుడు, మాకు అనంత ఐశ్వర్యమును కలిగించుగాక.

అప్పుడే దట్టంగా అలుముకున్న మబ్బుల సమూహము వలె, కటిక అమావాస్య రాత్రియందు చీకటి మాదిరి భాసించు నల్లని (అక్కడ విషం ఉండటం వల్ల) కంఠము కలిగినవాడు, గంగానదిని ధరించినవాడు, గజచర్మాన్ని ధరించినవాడు, చంద్రుని తలపై ధరించినవాడు – నాకు సంపదలను చేకూర్చును గాక!

సర్వ జగత్తు యొక్క భారాన్ని తనపై ఉంచుకున్నవాడు, చంద్రుని ధరించి శోభించేవాడు, సురగంగను తనయందు కలవాడు, కారు మబ్బులు చెలరేగి చుట్టుముట్టిన – అమావాస్య నాటి అర్థరాత్రియందలి చిమ్మ చీకట్లను ముద్దగా చేసి ఇక్కడ బంధించినారా, అన్నట్టున్న నల్లని కంఠం కలవాడు అయిన మహాదేవుడు మాకు సకల సిరులను కరుణించుగాక!

09. ప్రఫుల్లనీలపంకజ ప్రపంచకాలిమప్రభా–
–వి(వ)లంబి కంఠ కందలీ రుచిప్రబద్ధకంధరమ్।
స్మరచ్ఛిదం పురచ్ఛిదం భవచ్ఛిదం మఖచ్ఛిదం
గజచ్ఛిదాంధకచ్ఛిదం తమంతకచ్ఛిదం భజే॥

వికసించిన నల్లకలువపూలప్రోవు ఎంత నల్లని కాంతిని విరజిమ్మునో – అంత నల్లదనముతో ప్రకాశించు కంఠదేశముగల, కామారి, పురారి, దక్షయజ్ఞ విధ్వంసకుడైన సంసారహారి – గజదనుజారి, అంధకాసురుని చీల్చి చెండాడిన శూలపాణి – ఆ కాలుడు నా సేవలను గైకొనుగాక!

సంపూర్ణముగా వికసించిన నల్ల కలువపూల సమూహము విరజిమ్మే నల్లని కాంతి గల గరళకంఠుడు, కామునికి శత్రువు, త్రిపురారి, దక్షయజ్ఞమును ధ్వంసము

చేసినవాడు, గజాసురవైరి, అంధకాసురుని తన శూలముతో సంహరించిన ఈశ్వరుడు, నా పూజలను స్వీకరించి నన్ను అనుగ్రహించుగాక.

బాగా వికసించిన మృదువైన నల్లటి కలువ పూల సమూహము ఎంత కాంతిని విరజిమ్మునో అంతటి నల్ల దనముతో ప్రకాశించు కంఠము కలిగినవాడు; మన్మథుని, త్రిపురాసురుని ఛేదించినవాడు, ఆశ్రయించిన భక్తులకు సంసారమే (జననము, మరణము) లేకుండా చేసేవాడు; దక్ష యజ్ఞము ఛేదించినవాడు,; గజాసురుని, అంధకాసురుని ఛేదించినవాడు,; యముని (మరణాన్ని) ఛేదించినవాడు, – అగువానిని భజించెదను!

వికసించిన నల్లకలువ పూల మధ్య మూల భాగం ఎంత నల్లని కాంతిని విరజిమ్మునో – అంత నల్లదనముతో ప్రకాశించు కుంఠము గలిగి – మన్మథుని హరించినవాడు – త్రిపురములను సంహరించినవాడు – భవబంధ హరుడు – సంసారహారి – గజదనుజారి – అందకాసురుని చీల్చి చెండాడిన శూలపాణి – యముడిని అదుపుచేసిన వాడు అయిన ఆ శివుడికి, నేను మ్రొక్కెదను.

10. అగ(ఖ)ర్వ సర్వమంగళా కళా(లా)కదంబ మంజరీ
రసప్రవాహ మాధురీ విజృంభణా మధువ్రతమ్।
స్మరాంతకమ్ పురాంతకమ్, భవాంతకమ్ మఖాంతకమ్
గజాంతకాంధకాంతకం, తమంతకాంతకం భజే॥

సర్వమంగళా కళావిలాసముల మాధురీ రస ప్రవాహమున గండు తుమ్మెదవలె ఆసక్తుడై చెలగు ప్రభువు – కామారి – పురారి – భవహారి – దక్షయజ్ఞ ధ్వంస మొనర్చిన ఆ గజారి – అంధకారి – ఆ యమాంతకుడు – నటరాజు – మా సేవల నంగీకరించుగాక!

అత్యంత పవిత్రమైన కదంబ పుష్పముల నుండి వచ్చే సుగంధము చుట్టూ భ్రమించే తుమ్మెదలాగా సంచరించే స్వామి, మన్మథ సంహారి, త్రిపురాసుర విధ్వంసీ,

భవబంధములను తొలగించి, గజాసురుని, అంధకుని సంహరించి, కాలునికే కాలుడైన నటరాజు మా సేవలను స్వీకరించుగాక.

పరిపూర్ణమైన అన్నీ మంగళములతో, సర్వ (సృష్టిలో ఉన్న అన్నీ) కళలతో (విద్యలు) శోభిల్లుతూ పూలగుత్తిలా అక్కడ అమ్మవారు కూర్చొని ఉండగా పరమేశ్వరుడు తుమ్మెద వలె ఉత్సాహముతో నాట్యం చేస్తున్నాడు. మన్మథుని అంతం చేసినవాడు – త్రిపురాసురుని అంతం చేసినవాడు – ఆశ్రయించిన భక్తులకు సంసారమే (జనన మరణాలు) లేకుండా చేసేవాడు – దక్ష యజ్ఞమును అంతం చేసినవాడు, గజాసురుని అంతం చేసినవాడు, అంధకాసురుని అంతం చేసినవాడు, యముని (మరణాన్ని) అంతం చేసినవాడు – అగువానిని భజించెదను.

సర్వమంగళ కళావిలాసములతో, కదంబ పూల నుండి వచ్చే తేనెల గుభాళింపులకు, గండుతుమ్మెదవలె ఆసక్తుడై చెలగు ప్రభువు – మన్మథుని హరించినవాడు – త్రిపురములను సంహరించినవాడు – భవబంధ హరుడు – సంసారహారి – గజదనుజారి – అందకాసురుని చీల్చి చెండాడిన శూలపాణి – యముడిని అదుపుచేసిన వాడు అయిన అ నటరాజుకి నేను మ్రొక్కెదను!

11. జయత్వదభ్ర విభ్రమ భ్రమద్భుజంగ మశ్వస–
–ద్వినిర్గమత్ క్రమస్ఫురత్ కరాళ ఫా(భా)లహవ్యవాట్।
ధిమిద్ధిమి ద్ధిమిధ్వనన్మృదంగ తుంగ మంగళ
ధ్వనిక్రమ ప్రవర్తిత ప్రచండ తాండవః శ్శివః॥

పరిభ్రమణ వేగమున పాములు బుసకొట్టగా, వెలికి ఉబికి మెఱయుచున్న ఫాలనేత్రాగ్నిగల రుద్రునకు, ధిమి, ధిమి, యను మద్దెలయొక్క సమున్నత మంగళ ధ్వనులకు అనుకూలముగా అడుగులు వేయుచు ప్రచండముగా తాండవించు నటరాజునకు – శివునకు జయమగుగాక!

ఈశ్వరుడు తన తాండవములో పరిభ్రమిస్తున్న వేగమునకు సర్పములు బుసలు కొడుతుండగా, ఫాలభాగమునుండి బయటకు వస్తున్న అగ్ని కలిగిన

ఈశ్వరుడు, మద్దెలలు చేస్తున్న ధిమి ధిమి అను మంగళమైన శబ్దములకు తగినట్లుగా అత్యంత ప్రచండ నృత్యము చేస్తున్న హరునకు జయము జయము.

శివుడు నాట్యం చేస్తునప్పుడు తలపై నున్న సర్పములు ఉత్సాహముగా కదిలి పడగ విప్పి బుస కొడుతున్నాయి. ఆ బుసలు జయధ్వానములు కాగా, సర్పముల యొక్క నేత్రములు అగ్నిజ్వాలలా మెరిసిపోతున్నాయి - అలాగే శివుని నుదిటి మీద ఉన్న నేత్రము కూడా మెరిసిపోయి అగ్ని జ్వాలలను వెదజల్లుతున్నది. ధిమిధిమి నాదములతో మృదంగము నుంచి వస్తు మంగళ కరమైన ధ్వనికి అనుగుణముగా పరమశివుడు ప్రచండ తాండవము చేస్తున్నాడు ...

వేగంగా చరిస్తూ, సర్పములు చేసే బుసల శ్వాసలకు, మరింతగా రాజుకుని ఎగసిపడే అగ్ని కీలలతో ఉన్న నుదురు గల రుద్రునకు, ధిమి, ధిమి అను మద్దెల సమున్నత మంగళ ధ్వనులకు తగినట్లుగా అడుగులు వేయుచు ప్రచండముగా తాండవించు నటరాజునకు - శివునకు జయమగుగాక!

(శివ తాండవం అయిపోయింది - వచ్చే 12, 13 శ్లోకాలలో భక్తుడి యొక్క కోరికల గురించి తెలుసుకోబోతున్నాము. ఈ కోరికలే మన కోరికలైతే - అంతకన్నా కావలసింది ఇంకేమీ లేదు)

12. దృషద్విచిత్ర తల్పయో ర్భుజంగమౌక్తికస్రజో
ర్గరిష్ఠరత్నలోష్ఠయోః సుహృద్విపక్ష పక్షయోః।
తృష్ణా(ణా)రవింద చక్షుషోః ప్రజామహీ మహేంద్రయోః
(సమప్రవృత్తికః కదా సదాశివం భజామ్యహమ్)॥
సమం ప్రవర్తయన్మనః కదా సదాశివం భజే॥

కటికనేలను, హంసతూలికా తల్పమును - సర్పమును, చక్కని ముత్యాల దండను - మహారత్నమును, మట్టి బెడ్డను - గడ్డిపరకను, కలువకంటిని - సామాన్య ప్రజను, సకల భూమండలాధీశుడైన మహారాజును - మిత్రపక్షమును, శత్రుపక్షమును అన్నిటిని సమ ప్రవృత్తితో తిలకించు సదాశివుని నేనెపుడు సేవింతునో కదా!

అది కటిక నేలయైనా – సుఖమునిచ్చు హంసతూలికా తల్పమైనా, సర్పమైనా – ముత్యాలహారమైనా, విలువైన రత్నమైనా – మట్టి ముద్ద అయినా, గడ్డి పరక అయినా – కలువ పుష్పమునైనా, సామాన్యుడినైనా – చక్రవర్తినైనా, మిత్రుడైనా – శత్రువైనా, అన్నిటిపట్లా సమ భావము కలిగిన ఈశ్వరుని నేను సేవించగలనా.

కటిక నేల యందు, మృదువైన పరుపు యందు, పాముల దండల యందు, ముత్యాల దండల యందు, అమూల్యమైన రత్నాల యందు, మట్టి బెడ్డ యందు, స్నేహితుల యందు, శత్రువుల యందు, గడ్డి పరక యందు, తామర వంటి కనులు కలిగిన సౌందర్య రాశి యందు, సామాన్యుని యందు, మహారాజు యందు – నేను (సమ దృష్టి) సమముగా వుండి ఎప్పుడు మహేశ్వరున్ని సేవించగలను?

కటికనేలను, హంసతూలికా తల్పమును – సర్పమును, చక్కని ముత్యాల దండను – మహారత్నమును, మట్టిబెడ్డను – గడ్డిపరకను, కలువకంటిని – సామాన్య ప్రజలను, సకల భూమండలాధీశుడైన మహారాజును – మిత్ర పక్షమును, శత్రు పక్షమును, అన్నింటినీ సమ ప్రవృత్తితో తిలకించుచున్న సదాశివునికి నేనేప్పుడు సేవ చేసుకుంటానో కదా!

13. కదా నిలింప నిర్ఝురీ నికుంజ కోటరే వసన్
విముక్త దుర్మతిః సదా శిరఃస్థ మంజలిం వహన్।
విముక్తలోల లోచనో లలాటఫాల లగ్నకః
(విలోలలోల లోచనో లలామ భాలలగ్నకః)
శివేతి మంత్రముచ్చరన్ స(క)దా సుఖీ భవామ్యహమ్॥

గంగాతటమున – పొదరింటినడుమ చిత్తమున గల దుర్వృత్తులనెల్ల వీడి చంచల నేత్రములను స్థిరమొనర్చి, భ్రూమధ్యమున మనసు నిలిపి, శివనామ మహామంత్రము నుచ్చరించుచు సుఖించుట నాకు ఎన్నడు సంభించునోకదా!

పవిత్రమైన గంగానదీతీరమున ఒక చక్కని పొదరింటిలో, మనసులోని దురాలోచనలను విడచి, స్థిరముగా ఉండక అటూ ఇటూ చలించే నేత్రములను

ఏకాగ్రపరచి, భ్రూమధ్యములో దృష్టిని నిలిపి, శివమంత్రమును ధ్యానించే భాగ్యము నాకు ఎన్నడు కలుగును!

ఎప్పుడు నేను గంగా నదీతీరమున గల సుందరమైన వృక్షముల క్రింద కూర్చొని ధ్యానం చేయగలను? పాపాత్మకమైన ఆలోచనలు వీడి - నా రెండు చేతులను నుదిటిపై ఉంచుకొని - కామ కళ్ళ (అడ్డ దిడ్డంగా అటూ ఇటూ చెదరిపోయే దృష్టి నుండి) నుండి విముక్తి పొంది, నుదిటి యందు మనస్సు నిల్పి - 'శివ' అను మంత్రము జపించుచూ ఎప్పుడు సుఖించెదను?

గంగానది ఒడ్డున - ఆశ్రయం ఏర్పాటుచేసుకుని, చిత్తమున గల దురాలోచనలను విడిచి, చంచల దృష్టిని స్థిరంగా చేసి, నుదుటి మధ్య నా మనసు నిలిపి, శివనామ మహా మంత్రమునుచ్చరించుచు తరించే మహాభాగ్యం నాకు ఎప్పుడు కలుగుతుందో కదా!

- ఫలశ్రుతి -

14. ఇమం హి నిత్యమేవముక్త ముత్త(క్త)మోత్తమం స్తవం
పఠన్ స్మరన్ బ్రువన్ నరో విశుద్ధిమేతి సంతతమ్।
హరే గురౌ సుభక్తిమాశు యాతి నాన్యథాగతిం
విమోహనం హి దేహినాం సుశంకరస్య చింతనమ్॥

నిత్యము ఈ స్తోత్రము చదివినను, అర్థము స్మరించినను, వివరించి పలికినను, మానవుడు శుద్ధుడగును. వాడు మహా శివభక్తుడగును. శివభక్తి సంపాదనకు వేరుదారి లేదు. శరీరధారుల అజ్ఞానము సదా శివధ్యానముచే మాత్రమే నశించును.

పరమ పవిత్రమైన ఈ స్తోత్రమును నిత్యము స్మరించినా, విన్నా, చదివినా, నోటితో పలికినా, జీవుడు ధన్యుడవుతాడు. అతడే గొప్ప శివభక్తుడు. ఇది తప్ప శివుని చేరుటకు వేరే దారిలేదు. జీవుల అజ్ఞానమును హరించు శక్తి కేవలము శివభక్తికి మాత్రమే కలదు అనుట నిస్సందేహము.

ఇక్కడ పేర్కొన్న విధంగా ఉత్తమోత్తమైన ఈ స్తోత్రాన్ని నిత్యం పఠనం చేసినను, స్మరించినను, పలికినను మనసు శుద్ధి అవుతుంది. మరియు శివుని యందు, పరమ గురువు యందు వెంటనే మోక్షానికి దారితీసే శివభక్తి కలుగుతుంది (నువ్వు తప్ప నాకెవ్వరూ లేరు అనే శివభక్తి) – అప్పుడు ఈ దేహానికి మోహం తొలిగిపోతుంది. శంకర చింతన దృఢంగా మిగులుతుంది.

నిత్యము ఈ స్తోత్రము చదివినను, అర్ధము స్మరించినను, వివరించి పలికినను, మానవుడు శుద్ధుడగును. వాడు మహా శివ భక్తుడగును. శివశక్తి సంపాదనకు వేరుదారి లేదు. శరీరధారుల అజ్ఞానము సదా శివ ధ్యానముచే మాత్రమే నశించును.

15. పూజావసానసమయే దశవక్త్ర గీతం

యః శ్శంభు పూజనపరం(మిదం) పఠతి ప్రదోషే।
తస్య స్థిరాం రథగజేంద్ర తురంగ యుక్తాం
లక్ష్మీం సదైవ సుముఖి(ఖీ)ం ప్రదదాతి శంభుః॥

ప్రదోషకాలమున శివపూజా పరిసమాప్తియందు ఎవడీ శివార్చనా పరమైన రావణకృతమైన స్తుతిని పఠించునో వానికి శివానుగ్రహముచే రథ గజ తురంగములతో సదా సుప్రసన్నమైన స్థిర సంపదలు సిద్ధించును.

శివ పూజ పూర్తి అయిన తరువాత, రావణకృతమైన ఈ స్తోత్రమును పఠించే వారికి ఈశ్వరుడు, రథములు, గజములు, అశ్వములతో సహా అగణిత ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తాడు. ఇది సత్యం ! సత్యం !! పునఃసత్యం !!!

ప్రదోషకాలమున శివపూజా పరిసమాప్తియందు ఎవడీ శివా – ర్చనాపరమైన రావణకృతమైన స్తుతిని పఠించునో వానికి శివానుగ్రహముచే రథ గజ తురంగములతో సదా సుప్రసన్నమైన స్థిర సంపదలు సిద్ధించును.

//ఇతి శ్రీ రావణకృత శివతాండవ స్తోత్రమ్ సంపూర్ణమ్//


(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)